AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAY.IN
21-7-2026 (Tuesday) MAIN EDITION

## ఇరాన్‌పై మరోసారి అమెరికా దాడులు



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** ఇరాన్‌పై మరోసారి అమెరికా బాంబు దాడులు చేసింది. ఇరాన్ మిలిటరీ కమాండర్ సెంటర్, డ్రోన్ లాంచ్ సైట్లు, ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌పై యూఎస్ క్షిపణులతో విరుచుకుపడింది. మరోవైపు కువైట్‌లోని యూఎస్ స్థావరంపై దాడి చేసినట్లు ఇరాన్ ప్రకటించింది. ఇరాన్‌లోని సిరిక్, బందర్ అబ్బాస్, ఖేష్మ్ ద్వీపం, షిరాజ్, ఇస్ఫహాన్‌లలో పేలుళ్లు సంభవించినట్లు ఇరాన్ మీడియా తెలిపింది. హర్ముజ్ జలసంధిలో నౌకలపై దాడి చేయడానికి ఇరాన్ ఉపయోగించే సైనిక సామర్థ్యాలను మరింతగా బలహీనపరిచేందుకే దాడులు జరిగాయని అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది.

## ప్రత్యేక టెట్ నోటిఫికేషన్ విడుదల




**అక్షరటుడే, హైదరాబాద్**: తెలంగాణలో ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల కోసం 2026 టెట్ నోటిఫికేషన్ విద్యాశాఖ మంగళవారం రిలీజ్ చేసింది. పదోన్నతులు, సర్వీస్ కొనసాగింపునకు తప్పనిసరి అని తెలిపారు. జూలై 22 నుంచి 29 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. సెప్టెంబర్ 7 నుంచి 11 వరకు రెండు పేపర్లుగా ఆన్‌లైన్లో పరీక్షలు నిర్వహించి, సెప్టెంబర్ 30లోగా ఫలితాలు విడుదల చేయనున్నారు.

## గురుకులాలను తనిఖీ చేయాలి




అక్షరటుడే, హైదరాబాద్ : రాష్ట్రంలోని అన్ని బీసీ గురుకుల విద్యా సంస్థలను ఆగస్టు 30లోగా పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, సురక్షిత వాతావరణం, మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. బీసీ గురుకుల విద్యాసంస్థల నిర్వహణపై సమీక్షించారు.

## ఉత్తరాదిని ముంచెత్తిన వానలు



అక్షరటుడే, నేషనల్ డెస్క్: ఉత్తరాదిలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జమ్మూ కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ అతలాకుతలం అవుతున్నాయి. ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడి 23 మంది మృతి చెందగా, ఏడుగురు గల్లంతయ్యారు. దీంతో కేదార్‌నాథ్, బద్రీనాథ్, యమునోత్రి, గంగోత్రి యాత్రలు నిలిపివేశారు.

## అమిత్ షా రాజీనామా చేయాలి



అక్షరటుడే, ఢిల్లీ : యువతపై మోదీ సర్కార్ దారుణంగా వ్యవహరించిందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. సోమవారం ఢిల్లీలో ఆందోళన చేపట్టిన వారిపై లాఠీచార్జీని ఖండించారు. యూత్‌కు ప్రధాని మోదీ ఎందుకు క్షమాపణ చెప్పడం లేదని ప్రశ్నించారు. నిన్నటి ఘటనకు బాధ్యత వహిస్తూ అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



## షూటింగ్‌లో బాలకృష్ణకు గాయాలు

**అక్షరటుడే, ఏపీ:** సినీ నటుడు బాలకృష్ణ షూటింగ్‌లో గాయపడ్డారు. కాకినాడలో ఫైట్ చిత్రీకరిస్తుండగా ఆయన మోకాలికి స్వల్ప గాయమైంది. బాలయ్య ప్రస్తుతం గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమాలో నటిస్తున్నారు. మాస్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా భారీ యాక్షన్‌తో సినిమాను రూపొందిస్తున్నారు. ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం కాకినాడ పోర్టులో జరుగుతోంది. ఈ క్రమంలో ఓ ఫైట్ షూట్ చేస్తుండగా.. మంగళవారం బాలకృష్ణ ప్రమాదవశాత్తు కింద జారి పడిపోయారు. దీంతో ఆయన మోకాలికి స్వల్ప గాయమైంది. చిత్ర యూనిట్ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. ఆయనకు వైద్యులు ప్రథమ చికిత్స చేశారు. స్వల్ప గాయం కావడంతో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. కొన్ని రోజులు రెస్ట్ తీసుకొమ్మని చెప్పినట్లు సమాచారం.

## సీజేపీ ఆందోళనకారులపై కేసు నమోదు

**అక్షరటుడే, ఢిల్లీ:** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిరసన కొనసాగుతోంది. సోమవారం హింసాత్మక ఘటనలు చోటు చేసుకోవడంతో పోలీసులు పలువురిపై కేసు నమోదు చేశారు. సీసీటీవీ ఫుటేజ్, వీడియో రికార్డింగ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ ఆధారాల ద్వారా ఆందోళనలో పాల్గొన్న వారిలో ఇప్పటికే పలువురిని గుర్తించారు. హింసాకాండపై దర్యాప్తు కొనసాగుతోందని, విధ్వంసం, పోలీసు సిబ్బందిపై దాడి, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించిన వారిపై చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఆందోళన సమయంలో జరిగిన హింసలో 118 మందికి పైగా ఢిల్లీ పోలీసు సిబ్బంది, 60 మంది నిరసనకారులు గాయపడ్డారు.

## ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు ప్రారంభం

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** హైదరాబాద్ నగరం (క్యూర్) పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇళ్ల కోసం దరఖాస్తు ప్రక్రియ మంగళవారం (జులై 21) నుంచి ప్రారంభమైంది. నగరంలో నివసిస్తున్న పేదలకు ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం అందించనుంది. ఇల్లు కోసం దరఖాస్తు చేసుకునే వారు పదేళ్లు క్యూర్ పరిధిలో నివాసం ఉండాలి. ఒక్క ఇంటికి రూ.11 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో ప్రభుత్వం రూ.5 లక్షలు రాయితీ ఇస్తుంది.

“

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డిపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పాలనపై తీవ్ర విమర్శలు చేశారు. తాను కేసీఆర్ అంత మంచోడిని కాదని చెప్పారు. మరో 28 నెలల తర్వాత తెలంగాణ రాష్ట్రానికి కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని పేర్కొన్నారు. అప్పుడు ఈరోజు తోకలు ఊపుతున్న అధికారులకు మిత్తితో సహా తిరిగి ఇస్తామని వార్నింగ్ ఇచ్చారు. రిటైర్ అయినా, సప్త సముద్రాల అవతల దాకున్నా గుంజుకొచ్చి ప్రజల ముందు పెడతామన్నారు.**

**– అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**



# కేసీఆర్ అంత మంచోడిని కాదు

**■ మళ్లీ గులాబీ పార్టీ అధికారంలోకి వస్తుంది ■ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ■ రేవంత్‌రెడ్డిపై విమర్శలు**

మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటలో రైతు సదస్సుకు కేటీఆర్ మంగళవారం హాజరయ్యారు. ఇటీవల ప్రాణాలు కోల్పోయిన నలుగురు రైతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించారు. లక్షెట్టిపేటలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో పంట కొనకపోవడంతో గోడ రైతులు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన రైతుల కుటుంబాలకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేసినా.. దున్నపోతు మీద వాన పడ్డట్లు ప్రభుత్వం నుండి స్పందన రాలేదన్నారు. చివరికి చేస్తామని ఒప్పుకున్నా ఇంతవరకి కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే బీఆర్ఎస్ పార్టీ తరఫున అండగా నిలబడాలని ప్రాణాలు కోల్పోయిన ప్రతి రైతు కుటుంబానికి రూ.5 లక్షలు అందజేశామని తెలిపారు.

### రైతు డిక్లరేషన్ ఎక్కడ

ఎన్నికల ముందు రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి రైతు డిక్లరేషన్ గురించి ఇచ్చిన హామీలు ఏమయ్యాని కేటీఆర్ ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ రైతులను పట్టించుకోవడం లేదన్నారు. ఓ వైపు వర్షాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నా.. సీఎం రేవంత్‌రెడ్డి తనకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నీళ్లు అడిగితే రక్తం చల్లాలని మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ రక్తం తీసుకొని అయినా పంటలకు నీళ్లు ఇవ్వాలని కోరారు. ముఖ్యమంత్రిని, దగాకోరు కాంగ్రెస్‌ను ఉరికించి కొడితే గానీ రైతు ప్రభుత్వం రాదన్నారు. రైతుల ముఖంపై మళ్లీ చిరునవ్వు చూడాలన్నా.. వారి కళ్లల్లో ఆనందం చూడాలన్నా కేసీఆర్ తిరిగి రావాలన్నారు.

### దగుల్బాజీ జాతి మాది కాదు

ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్, కేటీఆర్ జాతి ఏందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీనిపై తాజాగా కేటీఆర్ స్పందించారు. “పోరంబోకు, లుచ్చా, నికృష్ట, దగుల్బాజీ జాతి నీది రేవంత్ రెడ్డి”అన్నారు. ఉద్యమకారుల మీదకి తుపాకీ తీసుకుపోయిన పోరంబోకు జాతి తమది కాదన్నారు. తెలంగాణ తొలి ప్రభుత్వంలో రూ.50 లక్షలకు ఒక నాయకుడిని కొనాలని చూసిన దొరికిపోయిన జాతి తమది కాదని ఎద్దేవా చేశారు. ‘నీళ్ళు అడిగితే రక్తం చల్లుకోమన్న రాక్షస జాతి మాది కాదు’ అని పేర్కొన్నారు.

## నీళ్లున్నా.. పంటలు ఎండబెడుతున్న ప్రభుత్వం : హరీశ్‌రావు




**అక్షరటుడే, హైదరాబాద్**: వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నా.. ప్రభుత్వం దేవాదుల నుంచి నీటిని ఎత్తిపోయకుండా దిగువన ఏపీకి వదిలి పెడుతోందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మంత్రులు ఇటీవల దేవాదుల ప్రాజెక్ట్‌ను సందర్శించారని హరీశ్‌రావు గుర్తు చేశారు. 10 మోటార్లు ఆన్ చేసి నీటిని ఎత్తిపోస్తామని ప్రకటించారన్నారు. మంత్రులు వెళ్లిన రోజు 7 మోటార్లు నడిపించారని, తర్వాత నుంచి 5 మోటార్లే ఆన్ చేశారన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి మాత్రం 10 మోటార్లు ఆన్ చేసి 22 రిజర్వాయర్లు నింపి, 38 టీఎంసీల నీళ్లు ఎత్తుతామని చెప్పారన్నారు.

### ఎత్తింది 1.9 టీఎంసీలే..

ఓట్లు, తిట్ల మీద ఉన్న సోయి నీళ్ల మీద పెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు సూచించారు. బీఆర్ఎస్‌ను ఆపుతా అనే సీఎం ముందు నీళ్లను ఆపాలని సూచించారు. ‘బీఆర్ఎస్‌ను ఆపాడం మీ తాత తరం కాదు’ అని వ్యాఖ్యానించారు. జూన్ 1 నుంచి ఇప్పటి వరకు సమ్మక్క బ్యారేజీ నుంచి 105 టీఎంసీలు దిగువకు వదిలేశారన్నారు. 1.9 టీఎంసీలు మాత్రమే ఎత్తిపోశారని తెలిపారు.

## కొత్త ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి బాధ్యతల స్వీకరణ



**అక్షరటుడే, హైదరాబాద్:** ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయ అధికారిగా 2014 బ్యాచ్‌కు చెందిన ఐఎఫ్ఎస్ అధికారి మాధవ్ రాచయ్య సుల్పులే బాధ్యతలు స్వీకరించారు. ఆయన అంతకుముందు ఫ్రాన్స్‌లోని పారిస్‌లో ఉన్న భారత రాయబార కార్యాలయంలో 'ఫస్ట్ సెక్రెటరీ'గా పనిచేశారు.

## అఫ్గానిస్తాన్‌లో ఆకస్మిక వరదలు.. 20 మంది మృతి

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** తూర్పు అఫ్గానిస్తాన్‌లో సంభవించిన ఆకస్మిక వరదలు తీవ్ర విషాదాన్ని నింపాయి. ఈ విపత్తు కారణంగా 20 మంది ప్రాణాలు కోల్పోగా, సుమారు 80 మందికి పైగా గాయపడ్డారు. మరో 100 మందికి పైగా గల్లంతైనట్లు అఫ్గాన్ అధికారులు వెల్లడించారు. గల్లంతైన వారిని రక్షించేందుకు సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. వరద ముప్పు ఉన్న ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు హెచ్చరించారు.



## దోషులకు కఠిన శిక్ష పడేలా చేస్తాం: మోదీ



**అక్షరటుడే, ఢిల్లీ:** ఢిల్లీలో మంగళవారం ఉదయం జరిగిన ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా కలకలం రేపిన 'నీట్' పరీక్షల అక్రమాలు , పేపర్ లీకేజీ వ్యవహారంపై సమావేశంలో స్పందించారు. విద్యార్థుల ప్రయోజనాలే తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. విద్యార్థులకు ఎలాంటి నష్టం జరగకుండా త్వరితగతిన పరీక్షలు నిర్వహించి ఫలితాలు వెల్లడించామని ఆయన తెలిపారు. పేపర్ లీకేజీలకు పాల్పడడం అత్యంత తీవ్రమైన నేరమని పేర్కొంటూ, విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకున్న దోషులను చట్టపరంగా కఠినంగా శిక్షించేందుకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.

## సొరంగం కూలి 8 మంది కార్మికులు మృతి



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** సిక్కింలోని నామ్చి జిల్లాలో సంభవించిన ఘోర ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. జోలుంగేలోని సమర్‌దుంగ్ వద్ద జల విద్యుత్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన నిర్మాణంలో ఉన్న సొరంగం కొండచరియలు విరిగిపడడంతో కూలిపోయింది. ప్రమాద సమయంలో లోపల సుమారు 27 మంది కార్మికులు చిక్కుకుపోయారు. సొరంగం లోపల గ్యాస్ నిండిపోవడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. చిక్కుకున్న వారిని కాపాడేందుకు వెళ్లిన సిబ్బందిలో పలువురు తలతిరగడం, స్పృహ కోల్పోవడం వంటి సమస్యల బారిన పడ్డారు. అయినప్పటికీ శ్రమించి అధికారులు ఇప్పటివరకు 16 మంది కార్మికులను సురక్షితంగా రక్షించారు.

## ఢిల్లీలో రైతుల నిరసన..



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్ :** ఢిల్లీలోని కిసాన్ ఘాట్ దగ్గర రైతులు నిరసన తెలిపారు. ప్రతిపాదిత భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా రైతులు ఆందోళన చేపట్టారు. కిసాన్ ఘాట్‌లో రైతులను పోలీసులు అరెస్ట్ చేశారు. బస్సుల్లో అక్కడి నుంచి తరలించారు. ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, అమెరికాభారత్ వాణిజ్య ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

### సరిహద్దు మూసివేత

దేశ్ బచావో మార్చ్‌లో భాగంగా రైతులు ఢిల్లీ వైపు కదులుతుండడంతో హర్యానా పోలీసులు శంభు సరిహద్దును మూసివేశారు. కీలక మార్గాల్లో బారికేడ్లను ఏర్పాటు చేయడంతో పాటు, పలువురు రైతు నాయకులను అదుపులోకి తీసుకున్నారు.

## పట్టాలు తప్పిన గూడ్స్..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఘజియాబాద్‌న్యూ ఢిల్లీ సెక్షన్ మధ్య సరుకులతో వెళ్తున్న ఒక గూడ్స్ రైలు మంగళవారం ఉదయం పట్టాలు తప్పింది. ఆరు బోగీలు అకస్మాత్తుగా పట్టాలు తప్పడంతో ఈ మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగిందని రైల్వే అధికారులు తెలిపారు. అదృష్టవశాత్తు, ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. ఘటన జరిగిన వెంటనే రైల్వే అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. రైళ్ల పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. గూడ్స్ రైలు పట్టాలు తప్పడం ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను రద్దు చేయగా.. మరికొన్నింటిని దారి మళ్లించారు.